

కాశ్మీరం.. గాంధేయం.. త్రివర్ణం!

75th స్వాతంత్ర్యదినోత్సవాన్ని దేశ ప్రజలంతా ఈరోజు జరుపుకుంటున్నారు. ఏటా ఇదే రోజున జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవానికి, ఈ ఏడాది జెండా పండుగకు చాలా తేడా ఉంది. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాలను రెండేళ్ల పాటు నిర్వహించాలని నరేంద్రమోడీ ప్రభుత్వం గత ఏడాది నిర్ణయించింది. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. గాంధీ 150వ జయంత్యుత్సవాల తొలి ఏడాదిలో జరుపుకుంటున్న ఈ పంద్రాగస్టు దినాన సత్యాహింస బాటలో ఉద్యమాన్ని నడిపించిన గాంధీజీని సంస్మరిం



శ్రీనగర్ లోని లాల్ చౌక్ ప్రాంతం

చుకుని ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావల్సిన సమయం ఇది.

ఈ స్వాతంత్ర్య దినోత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేమిటంటే... 72సంవత్సరాలుగా మన దేశంలోనే అంతర్భాగంగా ఉంటూ, జాతీయ జీవన స్రవంతికి దూరంగా వేర్పాటువాదుల ఆంక్షలు, బెదిరింపులు, హుంకరింపుల మధ్య జీవించిన కాశ్మీరీలు అసలుసిసలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందటమే. వారికి ఈరోజు తొలి స్వాతంత్ర్య దినోత్సవం అన్నమాట. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి పేరిట రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దు కావడంతో ఆ రాష్ట్రం యావత్ భారత్ దేశంలో అంతర్భాగం అయింది. ఒకే దేశం - ఒకే రాజ్యాంగం నినాదం సాకారమైంది. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజల మాదిరిగానే భారత పౌరులుగా సమానావకాశాలూ, హక్కులు పొందే అవకాశం కాశ్మీరీలకు కలిగింది. 370 అధికరణం వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువ జరిగాయి. ఈ మాట వారే ఇప్పుడు చెబుతున్నారు. ఆ విషయాన్ని ఆంక్షలు లేని ప్రస్తుత స్వేచ్ఛా వాతావరణంలో వారు బహిరంగంగానే చెబుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు దేశ ప్రజలందరితో పాటు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించుకోవల్సిన కాశ్మీరీల ఇలాకాలో ప్రతిఏటా పాకిస్తాన్ జెండాలు రెపరెపలాడాయి. అలా చేయకపోతే వేర్పాటువాదులు, ఉగ్రవాదుల నుంచి దాడులు తప్పదన్న భయంతోనే పాకిస్తాన్ జెండాకు వందనం చేయాల్సివచ్చింది, తప్ప, భక్తితో మాత్రం కాదు. ఈ విషయాన్ని కాశ్మీరీ పండిట్లు పలువురు వేర్వేరు ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. 370 అధికరణం రద్దుతో తమకు గుండెలమీద పెద్ద భారం తొలగిపోయినట్టుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాశ్మీరీ ముస్లింలలో కూడా జాతీయవాదులు అనేకమంది ఉన్నారు. ఇప్పుడే కాదు.

మహాత్మాగాంధీ పిలుపుపై చదువు, ఉద్యోగ, ఉపాధి కార్యకలాపాలను విడిచిపెట్టి స్వాతంత్ర్య సమరంలో ప్రవేశించిన ముస్లిం నాయకులు ఎంతో మంది ఉన్నారు. పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో వారంతా కలిసి పనిచేశారు.

గాంధీజీ కార్యక్రమాల ప్రభావం: ఆ రోజుల్లో అందరిపైనా గాంధీజీ బోధనలు, కార్యక్రమాల ప్రభావం తీవ్రంగా ఉండేది. గాంధీజీని మానవ రూపంలో ఉన్న భగవంతుని అవతారంగా పరిగణించేవారు. ఆయన మాటను తోసిపుచ్చిన వారెవరూలేరు. అందుకు వారికి మనసు ఒప్పేది కాదు. ధర్మాలు పరులకు బోధించడానికే తప్ప తాము ఆచరించడానికి కాదని అంతకుముందు సమాజంలో పెద్దల అభిప్రాయంగా ఉండేది. గాంధీజీ ప్రజలకు ఏదైతే బోధించారో దానిని ముందుగా తాను ఆచరించేవారు. సర్వమానవ సమానత్వం గాంధీజీ బోధనల్లో అత్యంత ప్రధానమైనది. మానవజాతి ఉన్నంత కాలం గాంధీజీ సిద్ధాంతాలు కరదీపికలై ప్రజలకు మార్గదర్శనం చేస్తాయి.

1948లో లాల్ చౌక్ సభలో ప్రధాని నెహ్రూ, షేక్ అబ్దుల్లా

హిందూ, ముస్లిం, జైన్, సిక్కు, క్రైస్తవ బేధాలు లేకుండా సర్వమానవ సౌభ్రాతృత్వ భావాన్ని గాంధీజీ వ్యాపింపజేశారు. ఆయన సిద్ధాంతాలు సార్వత్రికమైనవి. ఒక్క భారత జాతికే కాకుండా యావత్ మానవజాతికి అవి దిక్సూచి వంటివి. మానవరూపంలో ఇలాంటి ఆదర్శ నాయకుడు మళ్ళీ పుడతాడా అన్నంత సందేహాన్ని మిగిల్చి వెళ్ళారు గాంధీజీ. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా గాంధీజీ చిత్ర పటాన్ని తన కార్యాలయంలో పెట్టుకుని నిత్యం స్మరించుకునేవారట. అహింసా మార్గం ద్వారా రాజీలేని పోరాటం జరిపి ఒక పెద్ద దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన ఏకైక నాయకుడు గాంధీజీ అని ఒబామా ప్రశంసించడమే కాకుండా, ఆనాటి యుపీఏ ప్రభుత్వ ప్రతిపాదనపై ఏటా అక్టోబర్ 2వ తేదీన గాంధీజీ జయంతి నాడు అహింసా దినోత్సవంగా ప్రపంచ దేశాల ప్రజలంతా జరుపుకునేట్టు ఐక్య రాజ్యసమితి చేత తీర్మానం చేయించారు.

ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ కూడా గాంధీజీ కార్య క్రమాలు, సిద్ధాంతాలు కేవలం బోధించడానికే కాదనీ, వాటిని అమలులో పెట్టేందుకే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఒకే దేశం - ఒకే రాజ్యాంగం అనే సిద్ధాంతాన్ని అమలులో పెట్టేందుకే 370వ అధికరణాన్ని రద్దుచేసే తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించేట్టు వ్యూహాత్మకంగా చర్యలు తీసుకున్నారు. దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలు సమానమేనని, ఏ ఒక్క ప్రాంతానికీ ప్రత్యేకత ఉండకూడదని ఆచరణలో చూపేందుకే, ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ అధికరణాన్ని రద్దుచేసారు. అలాగే, దేశంలో పౌరులు ఎక్కడైనా జీవించేందుకు, ఆస్తులు సంపాదించుకునేందుకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కును హరించే 35-ఏ అధికరణాన్ని కూడా రద్దు చేయించారు. పరమత సహనం గురించి బోధించడమే కాకుండా, జమ్ము, కాశ్మీర్‌లో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సహజీవనం సాగించే పరిస్థితులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మోడీ సాహసోపేతంగా తీసుకుంటున్న చర్యలకు దేశంలో అధిక సంఖ్యాకుల నుంచే కాకుండా, అగ్రరాజ్యమైన అమెరికా సహా పలు దేశాల మద్దతు లభిస్తోంది. 370వ అధికరణం రద్దును వ్యతిరేకిస్తున్న వారు దేశ, విదేశాల్లో కొద్దిమంది మాత్రమే ఉన్నారు. సహజంగానే అక్కసునూ, ఆక్రోశాన్నీ వెళ్ళగక్కుతున్న పాకిస్తాన్‌కు చైనా తప్ప మరే దేశమూ వత్తాసు పలకడం లేదు. చైనా కూడా నేరుగా 370వ అంశాన్ని ప్రస్తావించడం లేదు. దాయాది దేశం ఎన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు పన్నినా, ప్రతిసారీ మనమే విజయం సాధించడానికి మనకున్న ఆత్మస్థైర్యమే కారణం. గాంధీజీ వంటి మహనీయులు, త్యాగశీలురు వదిలివెళ్ళిన ఆశయాల ద్వారానే ఆత్మస్థైర్యాన్ని మనం

1992లోలాల్ చౌక్ వద్ద మురళీ మనోహర్‌జోషి జరిపిన ఏక్తా యాత్రలో త్రివర్ణపతాకంతో మోడీ

ఎప్పటికప్పుడు పొందగలుగుతున్నాం.

లాల్‌చౌక్‌లో జెండా ఆవిష్కరణ: స్వాతంత్ర్య దినోత్సవం నాడు కాశ్మీర్‌లో నిషేధాజ్ఞలు, కాల్పులు ఒక ఆనవాయితీగా మారాయి. ముఖ్యంగా, శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ జరిగి 71 ఏళ్ళు అయింది. 1948లో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆ చౌక్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. మళ్ళీ ఇంతకాలానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా అదే ప్రదేశంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. దేశం మొత్తం మీద జరిగే వేడుకలన్నీ ఒక ఎత్తు అయితే, లాల్ చౌక్‌లో జరిగే పతాకవందనం మరో ఎత్తు. కాశ్మీర్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందనడానికి ఇదే సంకేతం. అలాగే, కాశ్మీర్‌లోని ప్రతి నగరం, పట్టణం లోనే కాకుండా, గ్రామ గ్రామాన త్రివర్ణ పతాకాలను ఎగురవేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నా, కాశ్మీరీలు తమకు లభించిన స్వేచ్ఛ గురించి వెల్లడించేందుకు వీధుల్లోకి వస్తున్నారు. కాశ్మీర్ నుంచి మూడు దశాబ్దాల క్రితం కట్టుగుడ్డలతో ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్ళిపోయిన కాశ్మీరీ పండిట్లు తిరిగి స్వస్థలాలకు చేరేందుకు ఆతృతతో ఎదురు చూస్తున్నారు. ఉగ్ర వాదం పెచ్చరిల్లిన తర్వాత కాశ్మీర్‌లో ఎక్కువగా నష్టపోయింది కాశ్మీరీ పండిట్లే. దాడులు ఎక్కువగా జరిగింది కూడా వారిపైనే. చాలా మంది తమ ఆత్మీయులనూ, అయిన వారినీ కోల్పోయి, ఇతర ప్రాంతాల్లో రెండవ తరగతి పౌరులుగా జీవిస్తున్నారు. ఇప్పుడు తాము స్వస్థలాలకు వెళ్ళేందుకు స్వేచ్ఛ వచ్చిందని వారు ఆనందంతో పొంగి పోతున్నారు. కాశ్మీరీ పండిట్ల హర్షాతిరేకాలు, కేరింతలు టెలివిజన్ చానల్స్‌లో వీక్షిస్తున్న దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు గొప్ప అనుభూతిని పొందుతున్నారు. ఇంతకాలం మన దేశంలోనే మనవారే అయినా, మనవారు కానట్టుగా ఉంటున్న సోదర కాశ్మీరీలకు అభినందనలు తెలుపుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్ళకి కాశ్మీర్ మన దేశంలో విలీనం కావడం వల్ల సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టయిందన్న ఆనందం ప్రతిపౌరునిలోనూ తొణికిసలాడుతోంది.

కాశ్మీర్ సమస్యను కాశ్మీరీ సంస్కృతి పరిరక్షణతోనూ, మానవీయ కోణంతోనూ, ప్రజాస్వామికంగానూ పరిష్కరించాలన్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సూచన ఇంతకాలానికి అమలులోకి వచ్చినందుకు ప్రతిపౌరుడూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సర్వసత్తాక ప్రతిపత్తిని నిలబెట్టిన నిజమైన జెండా పండుగ నేడు. బీజేపీ అగ్ర నాయకుడు డాక్టర్ మురళీ మనోహర్ జోషి 1992 జూన్‌లో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఏక్తా యాత్ర నిర్వహించారు. బీజేపీ అధ్యక్షుని హోదాలో ఆయన శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ సమైక్యత నినాదంతో ఆయన జాతీయ జెండాతో ఈ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ కూడా పాల్గొన్నారు. జోషి, మోడీలు జాతీయ జెండాతో శ్రీనగర్ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

- పద్మనాభ స్వామి

స్వాతంత్ర్యోద్యమ ఫలాలు సాకారమయ్యేదెప్పుడు!

దేశప్రజల మధ్య వ్యత్యాసాలు తగ్గి ప్రజాస్వామ్యపద్ధతిలో మంచి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పుడే అన్నివర్గాల మధ్య అంతరాలు తగ్గి భారత స్వతంత్ర అభీష్టం సిద్ధిస్తుంది. భారత స్వాతంత్ర్యదినోత్సవాన్ని కేవలం ఒక ఉత్సవంగా జరుపుకొని హాలిడేగా ప్రకటించినంత మాత్రాన మన బాధ్యత తీరదు. స్వాతంత్ర్యం ద్వారా మనకు సిద్ధించిన ఫలాలను అనుభవిస్తూ బాధ్యతలు నిర్వహిస్తూ విధి విధానాలను పాటిస్తూ కులం, మతం, వర్గం, లింగం అన్ని అంశాలు సమాన ప్రతిపత్తితో ఆదరింపబడ్డప్పుడే స్వాతంత్ర్యానికి అసలైన గౌరవం. అందరూ సమైక్యంగా, సంతోషంగా ఉన్నప్పుడే భారతస్వాతంత్ర్య సమరయోధులకు ఘనమైన నివాళి.

దాసు సురేష్

ఎందరో త్యాగధనుల పోరాట ఫలితం ఈ రోజు మనం అనుభవిస్తున్న భారత స్వాతంత్ర్యం. భారతదేశ ప్రజలు తమని తామే పరిపాలించుకునే చిరకాలవాంఛ నెరవేరిన రోజు ఈ పంద్రాగస్టు. వర్తకులుగా భారతదేశానికి వలస వచ్చిన యూరోప్ దేశాల వ్యాపారస్తులు భారతదేశ ఔన్నత్యాన్ని, వనరులను, సంస్కృతి సంప్రదాయాలను చూసి అబ్బురపడి, ఇక్కడి భూభాగాన్ని హస్తగతం చేసుకోవడానికి పలు విధాలుగా ప్రయత్నించసాగారు. అప్పటికే భారతదేశంలో పాలన కొనసాగిస్తున్న ఐదువందల పైచిలుకు సంస్థానాలను క్రమక్రమంగా ఆక్రమించసాగారు. ఈ కాలక్రమంలో ఫ్రెంచి, పోర్చుగీసు, డచ్, ఇంగ్లీష్ తదితర దేశాలు మనపై ఆక్రమణలు చేయగా ఆంగ్లేయ వారు పూర్తిస్థాయిలో భారత భూభాగాన్ని వశపరుచుకున్నారు. తదనంతరం జరిగిన భారత స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో అనేక మంది ప్రముఖులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడి చివరకు అఖండ భారతావని దాస్యశృంఖలాలు విదిల్చి భారతమాతకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాన్ని ప్రసాదించారు. బానిస బతుకులు గడిపిన భారతీయులు గంపెడు ఆశలతో భారత స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరగకుండా పాటు పడ్డారు. చాలా మంది అసువులు బాసారు. ఎంతో మంది భారతీయులు నిరాశ్రయులయ్యారు. సమస్త భారతీయుల చిరకాల స్వప్నం అయిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సాధికారత వంటి అంశాలు స్వాతంత్రంతో సాకారం అవుతాయనుకున్నారు. భారతదేశంలో సామాన్యుడికి అవసరమైన విద్య,వైద్య,ఉద్యోగాలు, వనరులపై సాధికారత సాధ్యమవుతుందనుకున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ నిర్మాణంతో మన హక్కులు పరిరక్షింపబడతాయనుకున్నారు. కానీ నేటి భారతదేశ సమకాలీన ఆర్థికరాజకీయ సామాజిక వాతావరణంలో భారత స్వాతంత్ర్య మూల సిద్ధాంతం విస్మరించబడి ధనికులు ఇంకా ధనికులుగా మారుతూ లెక్కలేనంత సంపాదనతో రాజకీయ అధికారంతో తలతూగుతుండగాపేదవారు, మధ్యతరగతి వారు రెక్కాడితేకానీ డొక్కాడని దుర్భర పరిస్థితులలో ఇంకా కొట్టుమిట్టాడుతున్నారు. నేడు ప్రపంచ పటంలో అఖండంగా వెలిగిపోతున్న భారతావని సాంకేతిక, ఎదుగుదలతో అద్భుతాలను సృష్టిస్తూ అంతరిక్షంలో చంద్రయాన్ లాంటి వినూత్న ఆవిష్కరణలతో ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. అవినీతిని అంతమొందించే దిశగా ప్రయాణం చేస్తూ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్‌రద్దు, మహిళాసాధికారత, రైతులకు నిరంతర విద్యుత్, పెట్టుబడి సహాయం, వ్యాపారానికి అనుకూలమైన రవాణా, జాతీయ మార్గాలను విస్తరింపచేస్తూ స్వయంఉపాధి, నిత్యావసరాల సమర్థ పంపిణీతో విదేశీ మారకద్రవ్యాన్ని పెంపొందించుకుంటూ పలు సామాజిక పరిణామాలతో దూసుకెళ్తుంది. దేశ అంతర్గత భద్రతలో దృఢమైన నిర్ణయాలు తీసుకుంటూ శత్రు దేశాల పట్ల పటిష్ట వ్యూహా విధానాలు అవలంబిస్తూ అంతర్జాతీయ సంబంధాలను పెంపొందించుకుంటూ వినూత్న మార్పులకు స్వీకారం చేపడుతున్నా ఇంకోపక్క బాలల హత్యాచారాలు, బలహీనులపై బలవంతుల దోపిడీ, పీడనం, సమానహక్కులు సాకారమవ్వకపోవడం, ఆదివాసులపై, దళితులపై దాడులు, రైతన్నల, నేతన్నల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి, నిరుద్యోగం, జలవివాదాలు, దిగజారుతున్నాయి, విద్యా,వైద్యప్రమాణాలు స్వతంత్ర భారతావనిని ఇంకా తీవ్రంగా బాధిస్తూనే ఉన్నాయి. భారత రాజ్యాంగంలో భారతీయుడిగా పేర్కొన్న ప్రతి మనిషికి ఒకే ఓటు, ఒకే విలువ,సమానత్వం అనేవి స్వతంత్ర భారతావనిలో చాలా ఉన్నతమైన అవకాశాలు. భారతదేశం ముందు ఎన్నడూ ఎరుగని ఒక మహోన్నత అవకాశం ఈ సామాజిక సమానత్వం ద్వారా భారత పౌరులకు సిద్ధించాయి. కానీ స్వాతంత్ర్యానంతరం పాత సంస్థానాధీశులు, రాజులు, రాజ ఉద్యోగాలు, అడ్వకేట్లు, విద్యావంతులు సింహాభాగం పొందుతూ రావడం జరిగింది. తదనంతరం బడుగు బలహీన అణగారిన వర్గాలకు విద్య, పరిపాలన, రాజకీయ వ్యవస్థ

లలో సమాననిష్పత్తిలో అవకాశాలు లేనందున వారి కోసం ఫూలే, బి.ఆర్ అంబేద్కర్, నారాయణగురు, పెరియార్ రామస్వామి నాయకర్, రామ్‌మనోహార్‌లోహియా మండల్ వంటి వారు ఆయా కాలాల్లో ప్రాంతాల్లో కృషి చేస్తూ వచ్చారు. నాగరికత పరిణామక్రమంలో మానవ జీవితం మారినట్లుగానే ప్రజాస్వామ్యం పరిణితి చెందిన కొలది మార్పులు రావాలి. కానీ స్వాతంత్ర్యానంతరం కూడా అనేక ప్రాంతాల్లో సమాజంలో కులాల్లో ఇంకా అంతరాలు కొనసాగుతు న్నాయి. ఆధునిక సమాజంలో అన్నీ అందుకొని ముందుకు సాగుతున్న వారికి, అవి అందుకోలేనివారికి, అవి అందుకోవాలని తెలియని వారికి, అవి అందుకోవాల్సిన అవసరం లేదని భావించే సంస్కృతిలో భావజాలంతో జీవిస్తున్నవారికి మధ్య అంతరం ఇంకా కొనసాగుతూనే ఉంది. అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు ఉండాలి. అప్పుడే సామాజిక న్యాయంతో కూడిన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుంది. ఈ దశలో దేశంలో పేదరిక నిర్మూలనకు శాస్త్రీయంగా ప్రణాళికలు రూపొందించే ప్రయత్నాలు చేయకుండా పారిశ్రామికీకరణ ద్వారా జరుగుతున్న అభివృద్ధినే దేశాభివృద్ధిగా పరిగణించే మనదేశాన్ని అభివృద్ధిచెందు తున్న దేశంగా ప్రకటించుకోవడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా పరిగణించబడుతోంది. రాజ్యాంగంలో నిర్ణయించుకున్న సమాన హక్కులు అనే అంశాన్ని కాపాడుకోవడానికి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం భారతదేశంలో ఇప్పటి వరకు సమగ్ర అధ్యయనం చేసిన ఇంద్రసహాని కమిషన్, కాకా కాలేల్కర్ కమిషన్, గిర్గ్లాని కమిషన్, మండల్ కమిషన్, అనంతరామన్ కమిషన్ ఇలా అనేక కమిషన్లు అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు, చట్టసభల్లో సముచిత ప్రాధాన్యం, సమాన నిష్పత్తిలో ఉద్యోగావకాశాలు కల్పించే విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని, వైషమ్యాలను ఎండగట్టి వాటిని సాధించే విషయంలో ఇంకా వెనుకబడి ఉన్నామని తెలియచేసింది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నా దేశంలోని 18 రాష్ట్రాల నుండి బీసీల నుండి ఒక్క లోకసభ సభ్యుడు కూడా ఎన్నికకాకపోవడం ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది. 12 వందలకుపైగా బీసీ కులాలు ఇప్పటికీ సంచార జాతులుగా, విముక్త కులాలుగా జనాభా లెక్కలకు దూరంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా బతుకుతున్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ప్రజలకు విద్య,వైద్యం రాజ్యాంగబద్ధంగా ఉచితంగా ఇవ్వవలసిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. కానీ ఇది ఆచరణలో మాత్రం ఇప్పటికీ అంతంతమాత్రంగానే ఉంది. దేశ జనాభాలో 54 శాతం ఉన్న బీసీలకు పార్లమెంటులో 14 శాతం కూడా వాటా రాలేదు. దేశంలోని 50 శాతం జాతీయ సంస్థలు, కంపెనీలు, పరిశ్రమలు, కాంట్రాక్టులు రాజకీయ నాయకుల ఆధీనంలోనే ఉన్నాయనేది జగమెరిగిన సత్యం. అందుకే బ్యాంకులలో జరిగే మోసాలు బయటకు రావడం లేదు. ఇటీవల బయటపడ్డ కొన్ని కేసుల గురించి అధికార ప్రతిపక్షాలు ఒకరినొకరు విమర్శించుకోవడం, తమసుతాము ఈ స్కాముల నుండి సంరక్షించుకోవడమే తప్ప ఇటువంటి అక్రమాలు జరగకుండా శాశ్వత నివారణోపాయాలవైపు దృష్టిసారించడంలేదు. ప్రజాధనాన్ని సంరక్షించే విషయంలో, దేశరక్షణ విషయంలో రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. భారతదేశం స్వాతంత్ర్యానంతరం శాస్త్ర, సాంకేతిక రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధించినా ధనిక పేద ప్రజల మధ్య ఇప్పటికీ ఎంతో అంతర్యం కొనసాగుతూనే ఉంది.ఈ ఆర్థిక వ్యత్యాసాలు భారత స్వాతంత్ర్య ఫలాలు అందుకోవడం సగటు భారతీయులకు ఆటంకంగా ఉన్న విషయాన్ని రాజకీయ నాయకులు, మేధావులు ఆలోచించాల్సిన అవసరంఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్నివర్గాలు అధికారం చేజిక్కించుకోవడానికి ధనబలాన్ని, అంగబలాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఈ సందర్భంలో దేశప్రజల మధ్య వ్యత్యాసాలు తగ్గి ప్రజాస్వామ్యపద్ధతిలో మంచి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పుడే అన్నివర్గాల మధ్య అంతరాలు తగ్గి భారత స్వతంత్ర అభీష్టం సిద్ధిస్తుంది. భారత స్వాతంత్ర్యదినోత్సవాన్ని కేవలం ఒక ఉత్సవంగా జరుపుకొని హాలిడేగా ప్రకటించినంత మాత్రాన మనబాధ్యత తీరదు.స్వాతంత్ర్యం ద్వారా మనకు సిద్ధించిన ఫలాలను అనుభవిస్తూ బాధ్యతలు నిర్వహిస్తూ విధి విధానాలను పాటిస్తూ కులం, మతం, వర్గం, లింగం అన్ని అంశాలు సమాన ప్రతిపత్తితో ఆదరింపబడ్డప్పుడే స్వాతంత్ర్యానికి అసలైన గౌరవం. అందరూ సమైక్యంగా, సంతోషంగా ఉన్నప్పుడే భారతస్వాతంత్ర్య సమరయోధులకు ఘనమైన నివాళి. ●

(రచయిత:జాతీయ బీసీ అధికార ప్రతినిధి)

స్వరం మారిన స్వాతంత్ర్యం

మన స్వాతంత్ర్య సమరయోధులనుంచి ఆధునిక భారత నిర్మాతల వరకు దేశభక్తికి నిర్వచనం ఒక్కటే.. అదే ప్రేమభావన. న్యాయకాంక్షను వ్యక్తీకరించే ప్రేమభావంతోటే బంకించంద్ చటోపాధ్యాయ సుజలాం సుఫలాం అంటూ ఈ నేల గురించి పారవశ్యంతో పాడుకున్నారు. ఠాగూర్ 'జయహే జయహే' అంటూ దేశాలాపన చేశారు. మహమ్మద్ ఇక్బాల్ 'సారే జహాసే అచ్చా' అంటూ దేశ ప్రేమకు విశ్వజనీన నిర్వచనం ఇచ్చారు. లక్షలాదిమంది స్వాతంత్ర్య సమరయోధులు చివరి శ్వాస వరకు దేశంపట్ల ప్రేమతత్వంతోనే జ్వలించారు. మనిషి పట్ల ప్రేమ, నేలపై ప్రేమ, దేశమాతపై ప్రేమ, తమ స్వాతంత్ర్యంపై ప్రేమ.. ఇదే మన సమరయోధుల జ్ఞాపకాలకు శాశ్వతత్వం కలిగించింది. ఏడు దశాబ్దాల స్వాతంత్యం తర్వాత దేశం పట్ల ప్రేమ, దేశభక్తి తమ నిర్వచనం మార్చుకున్నాయేమో.. ప్రేమ స్థానంలో ద్వేషం, విభజనతత్వం రాజ్యమేలుతున్నాయేమో! ఇవన్నీ ఈ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంలో అవలోకించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

74th

నేడు భారతదేశం 73వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న శుభదినం. భారతదేశ చరిత్రలో మరచిపోలేని, మరపురాని చారిత్రక క్షణాలకు అద్దం పట్టే రోజిది. బ్రిటీష్ నిరంకుశ రాజరికపు పదఘట్టనలలో దాదాపు రెండు శతాబ్దాల పాటు తీవ్ర పోరాటాలు, సంఘర్షణల మధ్య జాతి మొత్తం నలిగిపోయిన అనంతరం భారతీయ ఉపఖండం స్వాతంత్ర్యం పొందిన దినం ఆగస్టు 15. స్వాతంత్యం సిద్ధించిన తర్వాతే భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామికంగా అవతరించిందన్నది వాస్తవం. శ్వేత జాత్యహంకారం ఈ నేలమీద నివసించే ప్రజ లను నల్లకుక్కలుగా ముద్రించి శ్వాస పీల్చడానికి కూడా అనుమతి పొందాలంటూ ఆదేశించిన బ్రిటీష్ దుర్భర పాలన నుంచి అష్టకష్టాలు పడి సిద్ధింపజేసుకున్న స్వాతంత్ర్యం మనది. అహింసా పోరాటాలు, హింసాత్మక పోరాటాలు, జాతీయ విప్లవోద్యమాలు ముప్పేటగా తలపడిన అనంతరం మాత్రమే పరాయి పాలన నుంచి మనం స్వతంత్ర వాయువులను పీల్చుకోగలిగాం. ఈ దేశం కోసం నిండు మనస్సుతో తపనపడిన లక్షలాది స్వాతంత్ర్య పోరాట వీరుల, వీరనారుల త్యాగ ఫలమే స్వాతంత్ర్యం. వారి చిరకాల స్వప్నాలు సాకారమైన క్షణం నుంచే, వారి ప్రాణ త్యాగాలు ఫలించిన క్షణం నుంచే మనం స్వతంత్ర భారతీయులమయ్యాం. జాతీయవాదం, దేశభక్తి రెండు జోడెద్దుల్లా దేశ పునర్నిర్మాణానికి నాంది పలికిన రోజు 1947 ఆగస్టు 15.

ఈ ఆగస్టు 15కి ఎన్నడూ లేని ప్రత్యేకత ఉంది. భారతదేశం నుంచి తమకు స్వాతంత్ర్యం కావాలని ప్రజానీకం కోరుకుంటున్న ఒక భూభాగాన్ని పూర్తి స్థాయిలో దేశంలో విలీనం చేసుకున్న ఘట్టాన్ని మనం నేడు చూస్తున్నాం. ఒక మాజీ సంస్థాన రాజ్యమైన జమ్మూకశ్మీర్ స్వయంప్రతిపత్తికి చెందిన చివరి అవశేషాలను భారత ప్రభుత్వం అత్యంత సాహసికంగా తొలగించి దాయాది దేశాన్ని సవాలు చేసిన ఉత్కంఠ భరితక్షణాల్లో మనం 73వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం. గాయపడిన కశ్మీరీ ప్రజల హృదయాలకు ఎలా సాంత్వన పలకగలం అనే దానిపై ఆధారపడే ఇకపై భవిష్యత్ భారత ముఖచిత్రం రూపొందనుంది. అదే సమయంలో దేశ పునర్నిర్మాణానికి నాందిపలికిన జాతీయవాదం, దేశభక్తి భావనలే తీవ్ర చర్చనీయాంశాలుగా మారి దేశానికి దేశమే రెండుగా చీలిపోయిన విపరిణామాలకు కూడా ఈ 73వ స్వాతంత్ర్య దినోత్సవ ఘట్టం అద్దం పడుతోంది. గత ఏడు దశాబ్దాలుగా దేశం వివిధ రంగాల్లో అసాధారణ విజయాలు పొందటం వాస్తవం. అదే సమయంలో దేశప్రజలకు ఓటు వేసే స్వాతంత్ర్యం తప్ప నిజమైన స్వాతంత్ర్యం ఇంకా సిద్ధించలేదనే వాదనలు కూడా బలం సంతరించుకోవడమన్నదీ వాస్తవమే. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యానికి, నిజమైన స్వాతంత్ర్యానికి మధ్యగల తేడాను కొత్తగా నిర్వచించుకోవలసిన క్షణం కూడా వచ్చేసింది. అందుకు చరిత్ర మూలాలు తడమటం తప్పనిసరి.

బ్రిటీష్ ఏలుబడిలోని భారత ప్రభుత్వ చట్టం 1935 ద్వారా ఏర్పడిన భారత సమాఖ్యలో చేరింది మొదలుకుని భారతీయ సంస్థానాల అధికారాలు, సంస్థానాధిపతుల హక్కులు తగ్గుముఖం పట్టే ప్రక్రియ



ప్రారంభమైంది. తమ సొంత ఆస్తులు, బిరుదులు, సౌకర్యాలను మాత్రమే తమ వద్ద ఉంచుకునే స్వాతంత్ర్యం సంస్థానాధిపతుల అనుభవం లోకివచ్చింది. స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా సంస్థానాధీశులు వీటిని పొందుతూ వచ్చారు కానీ 1970లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ రాజ్యాంగ సవరణ ద్వారా సంస్థానాధిపతుల ప్రత్యేక స్వాతంత్రం ఉనికిలో లేకుండా పోయింది. బ్రిటీష్ ప్రభుత్వ హయాం నుంచి స్వతంత్ర భారత ప్రభుత్వం వరకు సంస్థానాధీశులు పొందుతూ వచ్చిన రాజభరణాలు ఒక్క కలంపోటుతో రద్దయ్యాయి. ఈ క్రమంలో పాత భూస్వామ్య సంస్థానాధీశులు రూపం మార్చుకుని కొత్త ప్రభువులుగా అధికార పార్టీల్లో, అధికార స్థానాల్లో బలం పుంజుకున్నారు తప్పితే అప్పుడూ ఇప్పుడూ సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. వ్యవస్థ మారకుండానే దాన్ని వారసత్వంగా పొందే అవకాశం కులీనులకు, భూస్వామ్య ప్రభువులకు అయాచితంగా వరించింది.

ఏడు దశాబ్దాల తర్వాత కూడా భారత ప్రజాస్వామ్యం భూస్వామ్య అవశేషాల ప్రతిరూపంగానే ఉంటోంది. ప్రజలందరికీ ఓటు వేసే స్వాతంత్ర్యం మాత్రమే టెక్నాలజీ ప్రభావంతో దక్కింది కానీ నిజమైన రాజకీయ స్వాతంత్రం ఇప్పటికీ విస్తృత ప్రజానీకానికి అందుబాటులో లేదు. మనకంటే చాలా ఆలస్యంగా బ్రిటీష్ పాలన నుంచి పూర్తి స్వాతంత్ర్యం పొందగలిగిన కెనడా (1982), ఆస్ట్రేలియా (1986), న్యూజిలాండ్ (1986) దేశాలు ఆర్థికాభివృద్ధిలో, పౌరుల సామాజిక, వ్యక్తిగత స్వాతంత్ర్యాల విషయంలో ఎంతో ముందంజ వేయగా 1947లోనే బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన భారత దేశంలో సమాజం కానీ, ప్రజలు కాని ఆ దేశాల కంటే ఎంతో తక్కువ స్థాయిలో స్వేచ్ఛను అనుభవిస్తూండటం గమనార్హం.

ఒక దేశ పటం కానీ, జాతీయ జెండా కానీ ఒక నిర్దిష్ట భూభాగంలో నివసించే ప్రజల నిజమైన స్వాతంత్ర్యాన్ని స్ఫురింపజేయలేవు. ఇక ఓటుహక్కును కలిగి ఉండటం మాత్రమే స్వాతంత్ర్యం కాదు. జాతీయ పటం, జాతీయ జెండా, సార్వత్రిక ఓటు అనేవి సుందరమైన భావనలు మాత్రమే. ఏ హక్కులూ లేనిచోట ఓటుహక్కునైనా కలిగి ఉండటం చాలా మంచిదే కావచ్చు కానీ డబ్బు, కండ బలం లేకుండా ఎన్నికల్లో గెలవడం అసాధ్యమైపోయిన చోట ప్రజల ఓటుహక్కు దాని నిజమైన అర్థంలో ప్రాభవాన్ని కలిగి ఉన్నట్లు కాదు. మన ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చాలామంది మాజీ లేక ప్రస్తుత భూస్వామ్య దొరలే కావడం పరమవాస్తవం. ఉన్నావ్ బాధితురాలిపై అత్యాచారం కేసులో ఆరోపణలకు గురైన మాజీ బీజేపీ ఎమ్మెల్యే కులదీప్ సింగ్ సెంగార్ తన నియోజక వర్గ ప్రజలకంటే ఎక్కువ స్వాతంత్ర్యాన్ని పొందుతుండడం ఈ వాస్తవానికి మరొక రూపం మాత్రమే.

ఇక భారత ప్రజల విషయానికి వస్తే కోట్లాదిమంది ఇప్పటికీ కుటుంబం, ఉద్యోగం, సమాజం అనే జైలు గోడల మధ్య ఖైదీలుగా, జైలు గార్డుల్లాగా జీవితాలు గడుపుతున్నారు. అక్షరాలా వీరు తమ తమ బోనుల్లో ఎలాంటి జీవితం గడపాలని తమకు పాలకులు నిర్దేశిస్తున్నారో సరిగ్గా అలాంటి జీవితాన్నే గడుపుతూ వస్తున్నారు. వారి పుట్టుక, వారి మరణం వరకు వారి జీవిత పర్యంతమూ ఇతరుల నిర్ణయానుసారమే నిర్ణయమవుతున్నాయి. సంవత్సరంలో ఒక్క రోజు కూడా వారు తమ ఇష్ట ప్రకారం జీవించలేకపోతున్నారు. ఏం తినాలి, ఏం తాగాలి, వేటిని ధరించాలి అన్నీ కూడా పాలకులు, నిర్దేశించిన మార్గాల్లోనే సాగుతున్నాయి. సమాజ నిబంధనలు, పాలకుల ఆదేశాలు, నిర్ణయాలకు తలొగ్గి మాత్రమే మనం జీవించాల్సి వస్తోంది. అందుకే మన స్వాతంత్ర్యం ఇంకా మన ఇళ్లలోకి రాలేదు. ఇంటిబయటనే తచ్చాడుతోంది అంటూ మేధో చింతన మొత్తుకుంటోంది. ఇది నిజమైన స్వాతంత్ర్యం కాదు. ఇది మారాలి. చంద్రయాన్, మంగళయాన్, సౌరయాన్ వరకు మన అంతరిక్ష ప్రయోగాలు విజయబాటలో నడుస్తున్నప్పటికీ, ప్రపంచంలోని చాలా దేశాలకంటే మిన్నగా మనం ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నిండైన అర్థంలో గుబాళించే తరహా విముక్తి మన పౌరజీవితంలో సాధ్యం కాలేదు. కశ్మీర్ నుంచి, కన్యాకుమారి వరకు భారత సమాజంలో జరగాల్సిన నిజమైన మార్పు ఇదే. ఈ 73వ స్వాతంత్ర్య దినోత్సవం మనందరిపై విధించిన పెద్ద బాధ్యత ఇదే.

ఇవ్వాళ మన దేశభక్తి, నిజంగా ప్రేమకు సంబంధించిందేనా? అంతరాంతరాల్లో అవును అనిపిస్తున్నప్పటికీ ఎక్కడో సందేహం. కించిత్ అనుమానం.. మన దేశ ప్రేమ మన సోదరులపైనే ద్వేషంగా మారుతోందా? ప్రేమ, ద్వేషం ఒకే నాణేనికి రెండు వైపులుగా ఉంటున్నాయి. ఒకే హృదయంలో రెండు విరుద్ధ భావోద్వేగాలు కలిసి ఉంటున్నాయి. ఒక గణతంత్ర రాజ్యం మనగలిగేందుకు అస్కారమివ్వని అనారోగ్యపరిస్థితి ప్రస్తుతం దేశంలో అలుముకుంటోంది. జాతి మూలాలను పెకిలిస్తున్న ఉగ్రవాదంతో ఏ దేశమైనా కాంతివేగంతో తలపడాల్సిందే. కానీ ప్రతీకారం కోసం ప్రతిజ్ఞ చేయడం మన దేశభక్తి కారాదు. మానవత్వం కోసం పరితపిస్తున్నవారిని ద్వేషించడం మన భావజాలం కారాదు. ప్రజలందరూ నా కన్నబిడ్డలే అనే అశోకుడి తత్వాన్ని జాతీయ చిహ్నంగా మార్చుకోవడం సరే. దేశం అంతరంగంలో ఆ భావన గుబాళించాలి. దీనికి భిన్నంగా కులం, మతం, రంగు, జాతి, తిండి, అలవాట్లు, సంస్కృతి భేదాల పట్ల మనం ప్రదర్శించే ద్వేషభావం మన రిపబ్లిక్ లేక మన స్వాతంత్ర్య మూలాలనే పెకిలించివేస్తుంది. 73 సంవత్సరాల స్వాతంత్ర్యం దేశంముందు విసురుతున్న సవాలు ఇదే.

– కె. రాజశేఖర రాజు